గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి



రామంతాపూర్ : వివేక్‌నగర్‌లోని జీహెచ్‌ఎంసీ వార్డు ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలైన ఇందిరమ్మ ఇళ్లు, కొత్తరేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతుభరోసా పథకాలకు మంగళవారం నిర్వహించిన లబ్ధిదారుల ఎంపిక జాబితా ప్రకటన కార్యక్రమాన్ని జీహెచ్‌ఎంసీ మేనేజర్ పోచయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాల కోసం ఈనెల 24 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు మహ్మద్ రఫీక్, సుర్వీము రళీగౌడ్, సంధ్యారాణి, గాయత్రి, అరుణ్, నాని, జీహెచ్‌ఎంసీ అధికారి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయం



పారిశుద్ధ్య కార్మికులతో ఉప వైద్యాధికారి మంజుల

మౌలాలి : ఉర్సు ఉత్సవాల్లో పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయమని సర్కిల్ వైద్యాధికారి మంజుల అన్నారు. ఉత్సవాలకు హాజరయ్యేవారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రోజూ 30 మంది కార్మికులు ప్రత్యేక కృషి చేశారన్నారు. ప్రతిరోజు 20 టన్నుల వ్యర్థాలను తొలగించి స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించారన్నారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, అజయ్‌సింహ, అంజయ్య, శ్రీనివాస్, పద్మావతి, మనీషా తదితరులు పాల్గొన్నారు.

రూ.20 లక్షలతో సీసీరోడ్డు పనులు



సీసీరోడ్డు పనులను ప్రారంభించిన కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ విష్ణుపురికాలనీలో రూ.20 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ శ్రవణ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. విష్ణుపురి కాలనీలో భజరంగ్ కిరాణా దుకాణం నుంచి నర్సింహారెడ్డినగర్ రైల్వేట్రాక్ వరకు నూతనంగా బాక్స్‌డ్రైన్ నిర్మాణం చేపట్టామన్నారు. ప్రదీప్, నాని, చారి, మానిష్, రాజేష్, రవి, కొండల్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరంతో పేదలకు మేలు



రామంతాపూర్ : ముత్తూట్ ఫైనాన్స్ ఆధ్వర్యంతో రాజేంద్రనగర్, నేతాజీనగర్ బస్తీల్లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో దాదాపు 200 మందికి డాక్టర్లు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గృహ కార్మికుల యూనియన్ మేడ్చల్ జిల్లా కో- ఆర్డినేటర్ శోభ, అనిత, వినీత, పూలమ్మ, రమ, శ్రీదేవి పాల్గొన్నారు.
గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని



ఇందిరా నెహ్రూనగర్ హిల్‌చర్చి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రదీప్‌కుమార్, ప్రసాద్, కాలనీవాసులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కుషాయిగూడ: ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో లభ్యమైంది. చర్లపల్లి ఆర్టీసీ బస్‌స్టాండ్ వద్ద సుమారుగా 60–65 ఏళ్లున్న ఓ వృద్ధుడు పడి ఉన్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు బస్టాండ్ వద్దకు చేరుకుని పరీక్షించగా అతడు మృతి చెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పనులు పూర్తయ్యేనా.. నిధులు సమకూరేనా ?

- నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ సమీకృత మార్కెట్ పనులు
- రూ.7.5 కోట్లతో ప్రారంభించిన గత ప్రభుత్వం



పిల్లర్ దశలోనే మార్కెట్ పనులు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేడిపల్లి ఇంటిగ్రేటెడ్ సమీకృత మార్కెట్‌కు ఫిబ్రవరి 2,2022న పనులకు శంకుస్థాపన చేశారు. మూడేళ్లు గడుస్తున్నా 30 శాతం మేర పనులు జరిగాయి. 'ఎక్కడవేసిన గొంగడి అక్కడే' అన్న చందంగా ఉంది. నగర ప్రజల శ్రేయస్సు, రైతుల సంక్షేమం కోసం ఇంటిగ్రేటెడ్ వెజ్,నాన్ వెజ్ మార్కెట్ ఏర్పాటుకు గత ప్రభుత్వం నగరంలో పలు చోట్ల నిర్మాణాలను ప్రారంభించింది.

రైతుబజార్ స్థానంలో..

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న శివారు పీర్జాదిగూడ మున్సిపాలిటీలో గత కొన్నేళ్లుగా మూతపడిన రైతుబజార్ స్థానంలో రూ.7.50 కోట్ల ప్రభుత్వ నిధులతో గత ప్రభుత్వం ప్రారంభించింది. ఏళ్లు గడుస్తున్నా పిల్లర్ల వరకే పనులు నిలిచిపోయాయి.

అన్నీ ఒకేచోట..

నిత్యావసరాలు, మాంసాహార, శాకాహారం తాజా నాణ్యతతో ఒకేచోట లభించేలా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ఆలోచనతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.

ప్రభుత్వం మారడంతోనే..

మార్కెట్ పనులు ప్రారంభమైన కొంత కాలానికే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. అనూహ్య పరిణామాల మధ్య పీర్జాదిగూడలో కొన్ని నెలలు పాటు క్యాంపు రాజకీయాలు కొనసాగడంతో నగరంలోని పాలన స్తంభించింది. చివరికి ఇరువర్గాల ఎత్తుకు పైఎత్తులతో మేయర్ పీఠం కాంగ్రెస్ దక్కించుకుంది.

అధికారులు పట్టించుకోవాలి..

మేయర్ ఎన్నికై నెలలు గడుస్తున్నా.. మున్సిపల్ కార్యాలయం పక్కనే ఉన్న ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణం వైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు మండిపడుతున్నారు. అటు రాష్ట్రం, ఇటు పీర్జాదిగూడలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ చొరవ తీసుకుని పనులు పూర్తిచేయాలిన ప్రజలు కోరుతున్నారు.



గత ప్రభుత్వ హయాంలోని శిలాఫలకం

రైతుబజార్‌కు రూ.70 లక్షలు వృథా..

మేడిపల్లిలో రైతుబజార్ ఏర్పాటుకు 2015లో అప్పటి ప్రభుత్వం రూ.70 లక్షలతో రైతుబజార్‌ను ప్రారంభించింది. సంబంధిత అధికారుల నియంత్రణ కొరవడి ఆదిలోనే కాలగర్భంలో కలిసిపోయింది. ఈ క్రమంలో ప్రధాన పట్టణం, నగరాల్లో ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లకు ప్రభుత్వం పూనుకుంది. ఈ క్రమంలోనే రూ.7.50కోట్లతో ఆధునిక హంగులతో మూడేళ్ల క్రితమే మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా భూమిపూజ చేశారు.

పనులు నిలిచిపోవడంతో నిరాశ..

పనులు ప్రారంభమై పిల్లర్ దశలోనే నిధుల కొరతతో పనులు నిలిచిపోయి ఏళ్లు గడుస్తున్నా ముందుకు సాగకపోవడంతో వినియోగదారులు నిరాశకు లోనవుతున్నారు. మార్కెట్ పనులను ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు చొరవ తీసుకుని పనులను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నిధులు మంజూరుకాగానే పూర్తి చేస్తాం



మేడిపల్లిలో నిర్మించ తలపెట్టిన సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ పనులు ఇప్పటి వరకు రూ.1.30 లక్షలతో 30 శాతం పనులను పూర్తిచేశాం. మిగిలిన పనులకు నిధులు సమకూరడంలో జాప్యం జరిగింది. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే నిలిచిపోయిన పనులను సకాలంలో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం.

– సాయినాథ్‌గౌడ్ దీకు, పీర్జాదిగూడ కార్పొరేషన్

ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర మున్సిపల్ సంఘం అధ్యక్షుడు రవిచంద్రన్

అల్వాల్: తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా 4వ మహాసభలు మంగళవారం మచ్చబొల్లారం యాదవ్ కమ్యూనిటీహాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మున్సిపల్ సంఘం అధ్యక్షుడు కె.రవిచంద్రన్ హాజరై మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలన్నారు. రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఫిబ్రవరిలో పోరాట కార్యక్రమాలకు రూపకల్పన చేయాలన్నారు. మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏసురత్నం, జైపాల్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి సాయిలుగౌడ్ పాల్గొన్నారు.

నూతన కమిటీ..

జిల్లా గౌరవ అధ్యక్షులుగా మహేందర్, కార్య నిర్వాహక అధ్యక్షులుగా డీఎస్.శేఖర్, ఎం.రాంచందర్, అధ్యక్షులుగా హరినాథరావు, ఉపాధ్యక్షులుగా కె.శ్రీనివాసరావు, ఎల్లమ్మ, పద్మారావు, ప్రధాన కార్యదర్శిగా బీఐ.శ్రీనివాస్, ఉప ప్రధాన కార్యదర్శిగా నరేందర్, కార్యదర్శులుగా మల్లమ్మ, సాయిలు, కలమ్మ, బిక్షపతి, కోశాధికారిగా తిరుపతి, 19 మంది కార్యవర్గం కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ పరిధిలోని పలు అభివృద్ధి పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌తో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. డివిజన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో రూ.49 లక్షలతో చేపట్టనున్న పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. రూ.39 లక్షలతో బ్యాంక్ కాలనీలో మొదటి అంతస్తులో సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.10 లక్షలతో నార్త్ కల్యాణపురిలో ఓపెన్‌జిమ్‌ను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అన్ని డివిజన్లను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. బీఆర్‌ఎస్ నేతలు బన్నాల ప్రవీణ్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్ గీత

పేద విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి

ఉప్పల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మధురా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాగిడి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో 37 కంప్యూటర్లను అందజేశారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే బండారితో కలిసి ఆయన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. గత కొన్నేళ్లుగా ఉప్పల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేస్తున్న సేవలను ఆయన కొనియాడారు. పేదరికంలో ఉన్నా చదువుపై ఉన్న శ్రద్ధతో విద్యార్థులు ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యను నేర్చుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ప్రతిభావంతులైన విద్యార్థులను నిరంతరం ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. బీఆర్‌ఎస్ నేతలు, డిగ్రీ కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి, రాగిడి లక్ష్మారెడ్డి

సమష్టి కృషితోనే పార్కు స్థలం పరిరక్షించుకున్నాం



అల్వాల్: కాలనీవాసుల సమష్టి కృషితోనే పార్కు స్థలం అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోగలిగామని సాయిబాబానగర్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లారెడ్డి అన్నారు. అల్వాల్ సర్కిల్ పరిధిలోని మచ్చబొల్లారం డివిజన్ సాయిబాబానగర్‌లో మంగళవారం పలువురు కాలనీ ప్రతినిధులు మాట్లాడుతూ.. కాలనీ లేఅవుట్ ఏర్పాటు సమయంలో పార్కు స్థలంలో చూపించబడిన 1600 గజాల స్థలం కొంతకాలంగా అన్యాక్రాంతం అవుతుందని న్యాయపోరాటం చేస్తూ.. ఇటీవల హైడ్రా కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశామన్నారు. కాలనీ ఏర్పడినప్పటి నుంచి కాలనీ ప్రతినిధులు సమష్టిగా పోరాటం చేయడం వల్లే సాధ్యమైందన్నారు. కాలనీ ప్రతినిధులు సంజీవరెడ్డి, వరుణ్, సత్యనారాయణ, సుభాష్‌రావు, ప్రణీతరెడ్డి, పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు

బోడుప్పల్: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తున్నామని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో 1 నుంచి 10వ డివిజన్ల పరిధిలో మంగళవారం నిర్వహించిన వార్డు సభలను ఆయన పరిశీలించారు. రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు మొత్తం 1865 దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు. స్వీకరించిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి అర్హులకు పథకాలు అందేటట్లు చూస్తామన్నారు. కమిషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

మేడిపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ పథకాలు రేషన్‌కార్డు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు మంగళవారం పీర్జాదిగూడ మున్సిపల్ పరిధిలోని 1,2,6,7,11,12,16,17,21,22డివిజన్లలో వార్డుసభలను నిర్వహించి సంక్షేమ పథకాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించామని పీర్జాదిగూడ నగర కమిషనర్ త్రిలేశ్వర్‌రావు అన్నారు. నేడు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 3,4,8,9,13,14,18,19,23,24 డివిజన్లలో వార్డు సభలను నిర్వహిస్తామని ప్రకటించారు.



దరఖాస్తులను స్వీకరిస్తున్న మేయర్, కమిషనర్



ప్రజాపాలన వార్డు సభలో కమిషనర్ త్రిలేశ్వర్‌రావు

డైరీ ఆవిష్కరణ

మేడిపల్లి: ఉప్పల్ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన డైరీని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డిలు ఆవిష్కరించారు. అసోసియేషన్ డైరీని గత 14 ఏళ్ల నుంచి ఆవిష్కరిస్తున్నట్లు అసోసియేషన్ సభ్యులు చెప్పారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి ఎంపీ ఈటలకు స్థానిక సమస్యలను వివరించారు. కార్పొరేటర్ హరిశంకర్‌రెడ్డి, ఉప్పల్ బిల్డర్ అసోసియేషన్ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆకుల సత్యనారాయణ, కోశాధికారి చేగూరి మురళి, చైర్మన్ రమేష్, రమేష్‌బాబు, సతీష్‌రెడ్డి బిల్డర్స్ సభ్యులు పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు

నియామకం

మేడ్చల్: మేడ్చల్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వీరమల్ల శ్రవణ్‌కుమార్‌గుప్తా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర సంఘం శ్రవణ్‌కుమార్‌ను మండల సంఘం అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లికి చెందిన శ్రవణ్‌కుమార్ మండల రాజకీయాల్లో సీనియర్ నాయకుడిగా వ్యవహరిస్తున్నారు. ఆయన సతీమణి మానస 1వ వార్డు కౌన్సిలర్‌గా ఉన్నారు. మేడ్చల్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా చంద్రమౌళి నియమితులయ్యారు.

తాగునీటి సమస్యలను పరిష్కరించండి



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో కాలనీవాసులు

మౌలాలి : వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని ఈస్ట్ చంద్రగిరి కాలనీవాసులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని మంగళవారం కలిశారు. కాలనీలో నెలకొన్న తాగునీటి సరఫరాలో జాప్యం జరుగుతుందని, ఈ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన జలమండలి జీఎంతో మాట్లాడి వెంటనే సమస్యకు పరిష్కారం చూపాలని సూచించారు. కాలనీవాసులు శ్యామ్‌ప్రకాష్, వెంకటరెడ్డి, ఫరీద్, కరీం, సాయికుమారి తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్ పురస్కారం ప్రదానం



పురస్కారం అందుకుంటున్న బుడిగే రవికుమార్

కుషాయిగూడ: మార్షల్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకుడు కుషాయిగూడకు చెందిన బుడిగే రవికుమార్ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ పురస్కారం అందుకున్నారు. కరాటేలో ఆయన సాధించిన నైపుణ్యాన్ని నలుగురికి నేర్పుతూ కరాటేలో నిష్ణాతులుగా తీర్చిదిద్దుతున్నందుకు ఆయనకు ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ మేరకు బిర్లా సైన్స్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో పలు దేశాల నుంచి వచ్చిన కరాటే గ్రాండ్‌మాస్టర్లు ఆయనకు అవార్డును అందజేశారు. రాష్ట్రస్థాయి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో నిర్వహించిన కరాటే పోటీల్లో ఎంతో మంది విద్యార్థులను చాంపియన్లుగా తయారు చేయడంతో పాటు సుమారు 100 మంది పేదలకు కరాటేలో ఉచిత శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. తనకు ఇంటర్నేషనల్ మాస్టర్ ఆర్ట్స్ పురస్కారం రావడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో పేద విద్యార్థులకు కరాటేలో శిక్షణనిచ్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో దేశం పేరు నిలబడేలా చూస్తానన్నారు.

మర్యాదపూర్వక కలయిక



మంత్రి పొంగులేటికి వినతిపత్రం ఇస్తున్న డీజేఎస్ నేతలు

మల్లాపూర్: మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని దళిత జనసమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బొజ్జ యాదగిరి ఆధ్వర్యంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రైతుల సమస్యలు, గృహ నిర్మాణాల ఏర్పాటు విషయంలో ఎలాంటి పక్షపాత వైఖరి లేకుండా చూడాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు. దళిత జనసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, ఉపాధ్యక్షుడు సంపత్, కార్యదర్శి గంగాధర్, నరసింహారావు తదితరులున్నారు.

రైతుబజార్ స్థల పరిశీలన

మల్లాపూర్: నాచారం రైతుబజార్ స్థలంలో మల్టీపర్పస్ కమ్యూనిటీహాల్‌ను నిర్మించాలని జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ ఎస్టేట్స్ సామ్రాట్ అశోక్‌ను నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ కోరారు. మంగళవారం నాచారం రైతుబజార్‌ను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఖాళీ స్థలాన్ని వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను కార్పొరేటర్ కోరారు. కాప్రా డిప్యూటీ ఇంజినీర్ బాలకృష్ణ, శివరాజ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



సమస్యలు పరిష్కరించాలని వినతి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లో డ్రైనేజీ, సీసీరోడ్లు, వీధిలైట్లు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కాలనీ అధ్యక్షులు బాల్‌నర్సింహ ఆధ్వర్యంలో కమిషనర్ డాకు నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. కాలనీలో వ్యర్థాలు పారవేయడంతో అపరిశుభ్రంగా మారి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, వెంటనే సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ప్రకాష్, కాలనీవాసులు కుమారస్వామి, గణేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రగతినగర్ కాలనీవాసులు

గంజాయి విక్రేతల అరెస్ట్

మల్కాజిగిరి: గంజాయి విక్రయిస్తున్న నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి వారి నుంచి 1.5 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మౌలాలి దర్గా సమీపంలో గంజాయి అమ్ముతున్నారన్న పక్కా సమాచారంతో ఎక్సైజ్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందం దాడులు నిర్వహించి గంజాయి విక్రయిస్తున్న మహ్మద్ ఫహీమ్ (30),ఫజల్ పాషా(24)లను అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు మక్రం అలియాస్ పప్పు, మహేష్‌కుమార్ పరారీలో ఉన్నట్లు సమాచారం.

ప్రజాపాలన దరఖాస్తుదారులకు న్యాయం చేయాలి

మల్కాజిగిరి: ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుని నమోదు కాని దరఖాస్తుదారులకు న్యాయం చేయాలని కార్పొరేటర్ శ్రవణ్ కోరారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాగానే ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించిందని, దీనిలో భాగంగానే ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీతో పాటు పెన్షన్, ఇంటి కోసం పేద, మధ్యతరగతి ప్రజలు దరఖాస్తు చేసుకున్నారన్నారు. అధికారులు, ఎంట్రీ సిబ్బంది తప్పిదం వల్ల చాలామంది అర్హుల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదన్నారు. ప్రజా సమస్యలు వినే సమయం కూడా ప్రజాప్రతినిధులకు లేకపోవడంపై కార్పొరేటర్ ఆవేదన వ్యక్తం చేశారు.

డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని వినతి



కార్పొరేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని భవానీనగర్ రోడ్డునెంబర్-1లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని మంగళవారం కాలనీవాసులు కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్, జలమండలి మేనేజర్ సిరాజుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీవాసుల అభ్యర్థన మేరకు త్వరలోనే డ్రైనేజీ పైపులైన్ నిర్మాణం చేయిస్తామని హామీ ఇచ్చారు. కాలనీవాసులు నల్లా రాధాకృష్ణ, కట్ట బుచ్చన్న, విఠల్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, యాకీ, శివ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపే లక్ష్యం

మేడ్చల్: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మేడ్చల్ మండలంలోని అన్ని గ్రామాలలో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నామని మేడ్చల్ మండల బీజేపీ నూతన అధ్యక్షుడు శ్రీశైలంయాదవ్ అన్నారు. పట్టణ బీజేపీ నూతన అధ్యక్షురాలు శైలజ, మాజీ అధ్యక్షుడు ఆంజనేయులు, మండల మాజీ అధ్యక్షుడు నరేందర్ రెడ్డిలను ఆయన మండల నాయకులతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పార్టీని అన్ని గ్రామాల్లో బలోపేతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, రాఘవరెడ్డి, అర్జున్, భిక్షపతి, వంశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.